# సింహాచల మ్మహిమ

"ఎవుర్రా పోతన్నరు? వీరేశూ! అల్లుడూ నువ్వేనా! రా కూకో" అంటూ ఎదురుగావున్న బల్ల చూపించేడు గవర్రాజు.

అంతకుముందు ఆ బల్ల మీద కూర్చున్న చలమయ్య, ఎల్లయ్య లేచి, తమపై గుడ్డతో బల్లదులిపి కింద కూర్చున్నారు.

వీరేశు వచ్చి గవర్రాజుకి దండం పెట్టి, ఎదురుగా వున్న బల్లమీద కూర్చున్నాడు.

"ఏటల్లుడూ! మంచి సోకుమీద బయలెల్లేవు! బైస్కోపుకా నేక బాలమ్మ డిపోకా?" అంటూ ఆసికాలాడేడు గవర్రాజు.

గవర్రాజు ఆ చుట్టు పక్కల ఏడెనిమిది గ్రామాలకు మోతుబరు. అతని ఇంటా వెంటా ఎప్పుడూ ఆశ్రితులు వుంటారు. అతని సహాయం పొందని వారు ఆ చుట్టు పక్కల గ్రామాల్లో అరుదు. ప్రతిరోజూ సాయంత్రం నాలుగు రోడ్ల జంక్షన్‌లో, రామ్మందిరం ముందు బెంచీ మీద ఓ గంటసేపు కాలక్షేపం చెయ్యడం గవర్రాజు రివాజు.

"అబ్బే! అదేం లేదండీ! షికారుకని బయల్దేరేను" అన్నాడు వీరేశు.

"మరి నీ సదువుకి సుక్కేసినట్టేనా? అయినోడివని నాను మీ అయ్యకి సెప్తె, నా మీద యిరుసుకు పడ్డాడు. ఉన్న నాలుగు సెక్కలూ కుదువెట్టేసినాడా?

- ఓరల్లుడో! నా నోటి సెప్తా యినుకో. భూదేవి న్నమ్ముకునోళ్లం మనకి సదుగు లెందుకురా........."

"బాబూ! టీ సెప్పిరానా?" అన్నాడు ఎల్లయ్య.

గవర్రాజు వీరేశుని ఓమారు చూసి- "టీ వొద్దుకాని మజ్జిగొట్టుకురా" అంటూ పక్క జేబులోంచి నోట్ల కట్టలు తీసి అందులోంచి రూపాయి కాయితం తీసి, ఎల్లయ్య కిచ్చి, మళ్లీ నోట్లబొత్తి జేబులో కుక్కుకున్నాడు.

"నా మాటిని మరి సదువు జోలెల్లక. నువ్వు పై యోడి వేం కావు. ఆ మడిసెక్కలు నువ్వే దున్నుకో." గవర్రాజు మాటలకి వీరేశు మౌనం వహించేడు.

"బాబుగోరూ! నాకు తెలవకడుగుతాను, ఈ రోజుల్లో నాలుగు సెక్కలు దున్నుకుంటే ఏటవుద్ది? కరుసులు కూడా సూడం" అన్నాడు చెలమయ్య.

"అలాగడుగు సెప్తా! నాలుగు సెక్కల్లోనూ దాన్నె మెయ్యమాక. నాలుగు రకాల కూరగాయలెట్టు. ఏటవుద్ది? కర్సులు పోను పాతిక రూపాయలు మిగలకుంటే నన్నడుగు. మరి నీకు మట్టి పని గిట్టదనుకో ఏదైనా యాపారం సెయ్యి." ఎల్లయ్య మజ్జిగ పట్టించుకొని అందరికీ తలోగ్లాసు యిచ్చేడు.

"ఆ బాబుకాడ యాపారానికంత మదుపులుండొద్దూ?" అన్నాడు ఎల్లయ్య.

"యాపారాని క్కావల్సింది మదుపులు కాదురా! బుర్రుండాల! ఆ సన్నాసిగాడు సూడు, ఏటి సేస్తన్నడు? శేరు పాల్తో రెండు కుండలు మజ్జిక్కలుపుతున్నాడు. అంటే ఏటిది? వంద గలాసులు. రోజుకి కరుసులు పోను, యిర్వై రూపాయలు నాబం. అంతే కదరా బోడీ?" అంటూ ఖాళీ గ్లాసులు తీసికెళ్తున్న కుర్రాణ్ణడిగేడు గవర్రాజు. వాడు చిరునవ్వు నవ్వి వెళ్లిపోయేడు.

"అల్లుడూ! నువ్వు నాలుగు రాళ్లు పోగేసి నీ యిట్టం వొచ్చినంత సోకుసెయ్యి. యెవుడూ అడగడు.

– అంతెందుకు? మన సెయిర్మేన్ సిమ్మాసెలం ఎలా పెద్దోడయేడు? ఆడ్ని అంద్రు ఎలా సూత్తున్నారు? ఆడే యేపారం సేసేడో? ఆడి కదేటో తెల్సా?

– ఆడి బాబు ఆడి కేటిచ్చేడు? కొండ కింద అరయాసం బూమి. అందులో సిర్రాళ్లు తప్ప మరేటి మెలవ్వు. కాని సిమ్మాసెలంది గట్టి బుర్ర. ఏలా బతకాలని దిగులడలేదు. వోరం రోజులు యీది వాడా తిరిగేడు. నాలుగు సూసి యాపారం మొదలెట్టినాడు. ముస్టోళ్ల యాపారం. బేవారుసు గుంటల్ని పోగెట్టి, ఆల్లని కుంటోల్ని గుడ్డోల్ని సేసి నాలుగూళ్లలో యాపారం సేస్తన్నాడు. ఏటయిందనుకున్నావు? నాలుగూళ్లలో ఊరుకో మేడ కట్టేన్డు. కార్లు కొన్నాడు. కైరాతీ సత్రవు కట్టేన్డు. రామ్మందిరం కట్టినాడు. సెయిర్మనయేడు. ఆడేపారం ఆడింటిదానికే తెల్దు.

– ఆడింటిది కనకమ్మ దొడ్డ మడిసి. దరమ తల్లి. తొలి కోడి కూతకి నెగిసి, తాన్నమాడి, రూపాయి కాసంత బొట్టెట్టి దేముడికి దీప మెడతాది. ఈది గుమ్మంలో సేరిన గుడ్డోళ్ల కందరికి నూకలెయ్యందే నోట్లో నీరెయ్యని పతిగరత!

– ఆల్ల బొట్టెడున్నాడే, పెసాదు, అచ్చం దొరబిడ్డ. గొప్ప సురుకు. ఆడి సదువుకి నలుగురు మేష్ట్రమ్మలు.

– కనకమ్మ ఓ పాలి పెసాదుని తీసుకోని కన్నోరింటికి బయలెల్లింది. బండిదిగి సామాను అందుకోని బొట్టెణ్ణి సూస్తే నేడు! లబో దిబోమని, -టేసిన్లోను, బైట, యెతికింది. సిమ్మాసెలం, పోలీసులు కూడా యెతికిన్రు. నాబం నేక పోనాది.

– ఓ నెల్రోజులు దిగులెట్టుకుని, ఆ మట్న యాపారం సూడ్డాని కెల్లేడు

సిమ్మాసెలం. పని జూసుకుని బుడ్డీ ముందెట్టు కూకున్నాడు. యింతలో నాగులొచ్చి నాడని కవురొచ్చింది. నాగులంటే సిమ్మాసెలం కుడి భుజం. ఆడు, దిక్కులేని గుంటల్ని ఈడుసుగొచ్చి, కుంటోళ్లనో గుడ్డోళ్లనో సేసి, అడుక్కోడం తరిఫీదిచ్చి, సిమ్మాసెలం కింద నెలవారీ జీతానికున్నాడు.

– 'దొరా కొత్త పుంజు' అన్నాడు నాగులు. 'సరే యీడుసుకురా' అన్నాడు సిమ్మాసెలం.

– నాగులు తిరిగొచ్చేసరికి సిమ్మా సెలం రెండు బుడ్డీల పట్టుమీదున్నాడు.

– 'సూడుదొరా! సీమ్మిరపకాయ' అన్నాడు నాగులు.

– సిమ్మాసెలం సూసిందేటనుకున్నావు?

"ఏటిది?"

"సెప్తే నువ్వు సిత్తయిపోగలవు"

"కత యిన్దానికి సిత్తేటి, సెప్పు"

"అయితే యినుకో, రెండు గుడ్లు ఊడబీకి యెర్రటి పచ్చిమాంసపు కళ్లల్లంట నీరు కారుతున్న ఆడి బొట్టెడు పెసాదుని!"

"ఆ !!!"

'వినోదిని' మంత్లీ, మార్చి *1952.*